క్లుప్తంగా

సాగునీరు విడుదల



సాగునీటిని విడుదల చేస్తున్న రైతులు

బూర్జ: నీలాదేవిపురం ఎత్తిపోతల పథకం ద్వారా ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి సాగునీటిని ఆదివారం విడుదల చేశారు. నాగావళి నదిలో మదుముకి ముందు ఉన్న స్టీల్‌ని శుభ్రం చేశారు. నీటి ప్రవాహానికి అడ్డు లేకుండా చెత్తను తొలగించారు. పంపులు, మోటార్లను బాగుచేశారు. నీలాదేవిపురం గ్రామ రైతులతోపాటు పరిసర గ్రామాల రైతులు పాల్గొన్నారు.

పరామర్శ..



చలమయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గోవిందరావు

పాతపట్నం: పాతపట్నం హనుమాన్‌నగర్‌లో ఉంటున్న తహసీల్దార్ జలారి చలమయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఈయన విశాఖపట్నంలోని సబ్బవరం తహసీల్దార్‌గా పని చేశారు. తహసీల్దార్ కుటుంబాన్ని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఆదివారం పరామర్శించారు. దేవాంగుల వీధికి చెందిన అంకడాల మోహన్‌రావు, బూరగాం గ్రామానికి చెందిన గడియా వెంకటరావు ఇటీవల మృతి చెందారు. ఆయా కుటుంబాలను ఎమ్మెల్యే పరామర్శించారు. పరామర్శించిన వారిలో తహసీల్దార్ సోమేశ్వరరావు, డిప్యూటీ తహసీల్దార్ ప్రసాదరావు, పైల బాబ్జి, సైలాడ సతీష్, శ్రీరామ్‌ప్రసాద్, కలమట భుజింగరావు ఉన్నారు.

క్రమశిక్షణ అలవర్చుకోవాలి



భారతమాత చిత్రపటానికి పూలమాల వేస్తున్న తేజేశ్వరరావు

పాతపట్నం: ప్రతి ఒక్కరూ క్రమశిక్షణ అలవర్చుకోవాలని బీజేపీ నాయకుడు సిరిపురం తేజేశ్వరరావు అన్నారు. స్థానిక కోర్టు కూడలిలో ఉన్న మహేంద్ర జూనియర్ కళాశాలలో ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో గురుపూజోత్సవం కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. భారతమాత చిత్రపటానికి పూలమాల వేశారు. అనంతరం మొక్కలను నాటారు. ఎస్.మధుబాబు, శ్రీకాంత్ రెడ్డి, భాను తదితరులు పాల్గొన్నారు.
కొత్తూరు: కొత్తూరులోని విజ్ఞాన భారతి ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం ఆర్ఎస్ఎస్ కొత్తూరు శాఖ ఆధ్వర్యంలో గురుపూజోత్సవం ఘనంగా నిర్వహించారు. ఆర్ఎస్ఎస్ జిల్లా విభాగ్ ప్రచారక్ కనుగుల సత్యం, ఆర్ఎస్ఎస్ స్వయం సేవాక్‌లు లోతుగెడ్డ తులసీవరప్రసాద్, తాతబాబు, ప్రిన్సిపాల్ కలమట శ్రీరాములు, మన్మథరావు, రామానుజులు తదితరులు భరతమాత చిత్రపటానికి పూలమాలలు వేశారు. ఆర్ఎస్ఎస్ సేవాక్‌లు పున్నగిరి, లోతుగెడ్డ భగవాన్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

కుప్పిలికి రాష్ట్ర స్థాయి బహుమతి



రాజారావు మాస్టారు

ఆమదాలవలస: ఆమదాలవలసకు చెందిన కవి కుప్పిలి వెంకటరాజారావు మాస్టార్‌కు రాష్ట్ర స్థాయి బహుమతి లభించింది. నెల్లూరుకు చెందిన 'అక్షరం' సంస్థ గత నెలలో ఆన్‌లైన్ ద్వారా నిర్వహించిన కవితల పోటీల్లో రాజారావు మాస్టార్ రచించిన 'ఆ వేలి చుక్కకు ఎప్పుడూ చుక్కెదురే' అనే కవితకు ప్రథమ బహుమతి లభించినట్లు సంస్థ నిర్వాహకులు చిన్ని నారాయణరావు ఆదివారం సమాచారం పంపారు. ప్రథమ బహుమతిగా రూ.1,116 నగదును పంపినట్లు కవి రాజారావు తెలిపారు.

రోడ్డుపై నిలిచిన వర్షం నీరు



రోడ్డుపై గోతుల్లో నిల్వ ఉన్న మురుగు నీరు

సారవకోట: మండలంలోని అలుదు నుంచి కోటబొమ్మాళి మండల పాకివలసకు వెళ్లే రోడ్డులో కేశవలస సమీపంలో రోడ్డు గోతుల మయం కావడంతో వర్షం నీరు నిల్వ ఉంటుంది. రోడ్డుకు ఆనుకుని ఉన్న కుళాయికు పూర్తిస్థాయిలో మూత అమర్చక పోవడంతో నీరు నిత్యం వృథా కావడంతో అక్కడున్న గోతిలో నీరు చేరి నిల్వ ఉంటుంది. గ్రామంలో మురుగు నీటి కాలువల్లో పూడికలు చేరడంతో పాటు కాలువలు ఆక్రమణలకు గురికావడంతో వర్షం పడితే మురుగు నీరు రోడ్లపై నుంచి ప్రవహిస్తుంది. ప్రస్తుతం వ్యాధులు వ్యాపించే సీజన్ కావడంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

కదిలిన రథ చక్రాలు

● నేత్రపర్వంగా జగన్నాథుడి రథయాత్ర



నరసన్నపేట: రథంపై కొలువుదీరిన జగన్నాథ స్వామిని పూజిస్తున్న భక్తులు



పాతపట్నం: పాతపట్నంలో జగన్నాథస్వామిని ఊరేగిస్తున్న భక్తులు

పాతపట్నం: పాతపట్నంలో జగన్నాథస్వామి రథయాత్ర ఆదివారం నేత్రపర్వంగా నిర్వహించారు. స్వామివారి ఊరేంగింపులో భక్తులు ఉత్సహంగా పాల్గొన్నారు. రథాలను, ఆలయాన్ని నిర్వహకులు సుందరంగా అలంకరించారు. సుభద్ర, బలభద్ర సమేత జగన్నాథస్వామిని రథంపై ఉంచి జూబ్లీహిల్స్ రోడ్డులో గల జగన్నాథ ఆలయం నుంచి నాగవంశం వీధి, మెయిన్ రోడ్డు మీదుగా బ్రాహ్మణవీధిలో ఉన్న గుండిచా మందిరానికి చేరుకుంది. రథయాత్రకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

సత్యవరాగ్రహారంలో..

నరసన్నపేట: మండలంలోని సత్యవరాగ్రహారంలో రథయాత్ర ఆదివారం సాయంత్రం ప్రారంభమైంది. పెద్దపేట రామాలయానికి రాత్రి చేరుకుంది. ఈ నెల 17 వరకు జగన్నాథ స్వామి పెద్దపేటలో కొలువుదీరి పూజలు అందుకుంటారు. ఈ సందర్భంగా సత్యవరాగ్రహారం గ్రామానికి చెందిన రుత్వికులు జగన్నాథస్వామి ఉత్సవ విగ్రహాలను రథంపైకి తీసుకువెళ్లారు. అనంతరం భక్తుల కోలాహలం మధ్య రథం కదిలింది. సత్యవరంలో మహిళలు జగన్నాథ స్వామికి హారుతులు పట్టి పూజించారు. నరసన్నపేట ఎంపీపీ ఆరంగి మురళి తన ఇంటి వద్ద కుటుంబ సమేతంగా పూజలు చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

బూర్జలో..

బూర్జ: బూర్జ గ్రామంలో జగన్నాథ రథయాత్ర ప్రధాన అర్చకులు గోపీశ్వర సాహు ఆధ్వర్యంలో ఆదివారం ప్రారంభమైంది. జగన్నాథుడు ఉత్సవాలు తొమ్మిది రోజులు నిర్వహిస్తారు. రోజుకు ఒక అవతారంతో స్వామివారు భక్తులకు దర్శనమిస్తారన్నారు. కమిటీ మెంబర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

అవలింగిలో..

సారవకోట: మండలంలోని అవలింగి గ్రామంలో గల జగన్నాథ స్వామి రథయాత్ర ఉత్సవాలు ఆదివారంతో ప్రారంభమైయ్యాయి. ఆలయంలో ప్రత్యేక, విశేష పూజలు నిర్వహించారు. అనంతరం స్వామి వారిని రథంపై ఉంచి స్థానిక గుండిచా మందిరానికి తరలించారు. అనంతరం గుండిచా మందిరంలో స్వామివారిని మత్స్య అవతారంలో అలంకరించి పూజలు నిర్వహించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

జలుమూరులో

జలుమూరు: మండల కేంద్రంతోపాటు బైరాగిపేటలో జగన్నాథ స్వామి రథయాత్ర నిర్వహించారు. స్వామివారిని రథంపై ఊరేగించి గుండిచా మందిరానికి తరలించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పొందూరులో..

పొందూరు: మండల కేంద్రంలో జగన్నాథ స్వామి రథయాత్ర ఆదివారం ఘనంగా నిర్వహించారు. జగన్నాథస్వామి ఆలయం నుంచి మూలవిరాట్‌లు బలరాముడు, శ్రీకృష్ణుడు, వారి సోదరి సుభద్రను తీసుకువచ్చి రథంలో ఊరేగించారు. మహారాజా మార్కెట్, పొందూరు బస్టాండ్‌లో భక్తుల దర్శనార్థం నిలుపుదల చేశారు. అనంతరం గుడించా మందిరంలో చేర్చారు. ఉత్కళాంధ్ర సంప్రదాయంలో రథయాత్రను నిర్వహించారు.



బూర్జ: రథాన్ని లాగుతున్న భక్తులు



సారవకోట: జగన్నాథుడిని గుండిచా మందిరానికి తరలిస్తున్న భక్తులు



పొందూరు: రథంలో ఊరేగుతున్న బలరాముడు, శ్రీకృష్ణుడు, సుభద్ర

యూత్ అండ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఏర్పాటు



ఆదిలక్ష్మికి రూ.5వేలు అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

కొత్తూరు: మండలంలోని మెట్టూరు బిట్-2 ఆర్ ఆర్ కాలనీలో యూత్ అండ్ ఎంప్లాయీస్ అసోసియేషన్ ఆదివారం ఏర్పాటైంది. అసోసియేషన్ అధ్యక్షుడిగా గవర మోహన్‌రావు, ఉపాధ్యక్షులుగా గవర భాగ్యరాజు, పెదకోట నవీన్, ప్రధాన కార్యదర్శిగా ప్రశాంత్ కుమార్, కార్యదర్శులుగా చిరంజీవి, గవర హరి, ట్రెజరర్‌గా గూనాపు రాధాకృష్ణ, ఆడిటర్‌గా పతివాడ కోటేశ్వరరావు, సలహాదారులుగా ముగ్గురు, సభ్యులు ముగ్గురు, గౌరవ సలహాదారులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మొదటి రోజు మెట్టూరు ఆర్‌ఆర్ కాలనీకి చెందిన బంటు ఆదిలక్ష్మికి వైద్య ఖర్చుల నిమిత్తం రూ.5 వేలు అసోసియేషన్ తరఫున సభ్యులు అందజేశారు. పేద పిల్లలకు, నిరుపేదలకు అసోసియేషన్ ద్వారా ఆదుకుంటామన్నారు.

వెదుళ్లవలసలో వైద్య శిబిరం



వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఆమదాలవలస: మండలంలోని వెదుళ్లవలస గ్రామంలో డయేరియా లక్షణాలతో టీడీపీ నాయకుడు బత్తుల లక్ష్మణరావు ఆదివారం మృతి చెందడంతో వైద్య సిబ్బంది అప్రమత్తమయ్యారు. తొగరాం పీహెచ్‌సీ వైద్యుడు పి. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో గ్రామంలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. డయేరియా లక్షణాలతో ఉన్న రోగులను గుర్తించడానికి ఇంటింటా సర్వే చేపట్టారు. వైద్యాధికారి మాట్లాడుతూ ప్రజలంతా కాచి చలార్చిన నీటినే తాగాలన్నారు. డయేరియా లక్షణాలు ఎవరికైనా ఉంటే వెంటనే వైద్య సిబ్బందిని సంప్రదించాలన్నారు. గ్రామంలోని బావుల్లో క్లోరినేషన్ చేశారు. డీఎల్‌పీఓ గోపీబాల, ఎంపీడీఓ ఎస్.వాసుదేవరావు, ఈఓపీఆర్డి దుంపల గోవిందరావు, వైద్య సిబ్బంది, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

గ్రోయిన్స్ నిర్మించండి



గ్రోయిన్స్ నిర్మాణం చేపట్టాల్సిన స్థలం

జలుమూరు: మండలంలోని అంధవరం పంచాయతీ ఉప్పరపేట వద్ద గ్రోయిన్స్ లేక ప్రతి ఏటా వర్షా కాలంలో నదీ ప్రవాహం ఎక్కువ కావడంతో ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకువస్తుందో అని అంధవరం, ఉప్పరపేట, రామకృష్ణాపురం, పర్లాం, మాకివలస తదితర గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరద ప్రవాహం అధికమైతే సుమారు 20 గ్రామాల ప్రజల రాకపోకలు స్తంభించిపోతాయన్నారు. వరద తాకిడికి పొలాలు నీట మునిగి ఏటా పంట నష్టం కలుగుతుందన్నారు. గతంలో ఏర్పాటు చేసిన గ్రోయిన్స్ వరద ప్రవాహానికి కొట్టుకుపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు స్పందించి గ్రోయిన్స్ నిర్మాణం చేపట్టాలని కోరుతున్నారు.



ఘనంగా ధర్మాన కృష్ణదాస్ పుట్టినరోజు వేడుకలు



పోలాకి: ధర్మాన కృష్ణదాస్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు

పోలాకి/సారవకోట/జలుమూరు/నరసన్నపేట: మాజీ డిప్యూటీ సీఎం, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ పుట్టినరోజు వేడుకలను ఆదివారం మబగాంలోని ఆయన నివాసం వద్ద అభిమానుల మధ్యలో ఘనంగా నిర్వహించారు. ఆయనకు శుభాకాంక్షలు తెలియజేసేందుకు నియోజకవర్గంతో పాటు జిల్లా వ్యాప్తంగా ఉన్న అభిమానులు, నాయకులు తరలివచ్చారు. మబగాంలో సందడి వాతావరణం నెలకొంది. శుభాకాంక్షలు తెలియజేసేందుకు వచ్చిన ప్రతి ఒక్కరికీ కృష్ణదాస్ కృతజ్ఞతలు తెలియజేశారు. పోలాకి జెడ్పీటీసీ సభ్యుడు డాక్టర్ ధర్మాన కృష్ణచైతన్య పార్టీ శ్రేణులకు పలకరించి స్వీట్లు పంచిపెట్టారు. పోలాకి, నరసన్నపేట, జలుమూరు, సారవకోట మండలాల నుంచి వచ్చిన పార్టీ నాయకుల సమక్షంలో వేర్వేరుగా కేక్‌లు కట్ చేశారు. పోలాకి మండలానికి చెందిన మాజీ డీసీబీసీ చైర్మన్ కరిమి రాజేశ్వరరావు, సారవకోట మండల కమిటీ అధ్యక్షుడు వరుదు వంశీకృష్ణ, పార్టీ నాయకుడు వరుదు దేవీ ప్రసాద్, వైస్ ఎంపీపీ గుణుపురం రామారావు, చిన్నాల లక్ష్మీనారాయణ, పల్లి కృష్ణారావు, నక్క తులసీదాస్, యాళ్ల శ్యామసుందరరావు, నిక్కు రాజశేఖర్, బొంగు కొండయ్య, బాడాన కృష్ణారావు, కొండాల బాబూరావు, గెల్లంకి వెంకటరావు, పోలాకి కేశవరావు, జలుమూరు ఎంపీపీ వాన గోపి, జలుమూరు మండల పార్టీ కమిటీ అధ్యక్షుడు కనుసు సీతారాం, వైస్ ఎంపీపీ తంగి మురళీ కృష్ణ, పైడి విఠల్‌రావు, శ్యామలరావు, నరసన్నపేట ఎంపీపీ ఆరంగి మురళి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతు రామారావు, నరసన్నపేట సర్పంచ్ బూరల్లి శంకర్, పార్టీ నాయకులు కేసీహెచ్‌బీ గుప్త, పోలాకి నర్సింహమూర్తి, ఉకలాపు రవి, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ జయంతి వేడుకలకు తరలిరావాలి

నరసన్నపేట: మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా నరసన్నపేటలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం నిర్వహించే కార్యక్రమాల్లో పార్టీ శ్రేణులు పాల్గొనాలని ఎంపీపీ ఆరంగి మురళి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు చింతు రామారావు కోరారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఈ కార్యక్రమాల్లో మాజీ డిప్యూటీ సీఎం, పార్టీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ పాల్గొంటారన్నారు. నరసన్నపేటలోని వైఎస్సార్ కూడలిలో ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తారన్నారు. అనంతరం పార్టీ కార్యాలయంలో కేక్ కటింగ్, ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు పండ్ల పంపిణీ నిర్వహిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమాల్లో పార్టీ ముఖ్య నాయకులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అభిమానులు పాల్గొనాలని కోరారు.

పాతపట్నంలో..

పాతపట్నం: మాజీ ముఖ్యమంత్రి, దివంగత నేత వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతి వేడుకలను సోమవారం ఉదయం 9 గంటలకు పాతపట్నం ప్రభుత్వ ఆస్పత్రి వద్ద నిర్వహించనున్నారు. ఈ మేరకు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు, వైస్ ఎంపీపీ సవిరిగాన ప్రదీప్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి హాజరవుతారన్నారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొనాలని కోరారు.

కొత్తూరులో..

కొత్తూరు: దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి జయంతి వేడుకలు కొత్తూరులో ఈ నెల 8 తేదీన నిర్వహించనున్నారు. ఈ మేరకు మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి కార్యాలయం నుంచి ఒక ప్రకటనలో ఆదివారం విడుదల చేశారు. కాలేజీ రోడ్డులోని వైఎస్సార్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి నివాళులర్పిస్తారన్నారు. మండలంలోని వైఎస్సార్‌సీపీ శ్రేణులు హాజరుకావాలని కోరారు.

నేడు ఇసుక ర్యాంప్ ప్రారంభం

కొత్తూరు: మండలంలోని అంగూరు వద్ద ఉన్న ఇసుక ర్యాంప్‌ను ఈ నెల 8 తేదీన ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ప్రారంభిస్తున్నట్లు స్థానిక తహసీల్దార్ ప్రసాదరావు ఆదివారం తెలిపారు. మెట్రిక్ టన్ను ధర రూ.340లుగా ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. రోజుకు 750 మెట్రిక్ టన్నులు మాత్రమే విక్రయించడం జరుగుతుందన్నారు. ట్రాక్టర్లకు మొదటి ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 3 గంటల వరకు విక్రయాలు చేస్తామన్నారు.

జనసేన బలోపేతానికి కృషి

ఆమదాలవలస: ఆమదాలవలస నియోజకవర్గంలో జనసేన పార్టీ బలోపేతానికి ప్రతి జనసైనికుడు కృషిచేయాలని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పేడాడ రామ్మోహన్‌రావు అన్నారు. ఆమదాలవలసలోని పార్టీ కార్యాలయంలో ఆదివారం పార్టీ కార్యవర్గ సమావేశం నిర్వహించారు. పార్టీ కార్యవర్గ ఎన్నికకు సంబంధించి చర్చించారు. నియోజకవర్గంలోని ప్రతి గ్రామంలో గల సమస్యలు ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చి పరిష్కారానికి కృషి చేద్దామని పిలుపునిచ్చారు. పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ప్రజావేదిక రేపు

హిరమండలం: స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణంలో ఈ నెల 9వ తేదీ ఉదయం 10 గటంలకు ఉపాధి హామీ పథకం సామాజిక ప్రజావేదికను నిర్వహించనుట్లు ఏపీఓ శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 23 గ్రామ పంచాయతీల్లో 2023-24లో జరిగిన ఉపాధి పనులపై గత నెల 27 నుంచి ఈ నెల 8వ తేదీ వరకు క్షేత్రస్థాయిలో సమాజిక తనిఖీ బృందం పరిశీలించందన్నారు. గ్రామ స్థాయిలో సభలు నిర్వహించి గుర్తించిన అంశాలపై చర్చించడం జరుగుతందన్నారు. అధికారులు, ఉపాధి సిబ్బంది, వేతనదారులు హాజరుకావాలని కోరారు.

విరాళాల అందజేత

హిరమండలం: అమరావతి నిర్మాణానికి హిరమండలానికి చెందిన పలువురు ఎమ్మెల్యే మామిడి గోవిందరావుకు విరాళాలు అందించారు. ఎంజీఆర్ యువసేన అధ్యక్షుడు పోతుల శ్రీధర్, సభ్యులు బాలకృష్ణ, కామేష్, హరి, సాయి, దామోదర్‌లు రూ.51 వేలు సేకరించి ఎమ్మెల్యేకు ఆదివారం అందించారు. హిరమండలానికి చెందిన టీడీపీ నాయకుడు లాడే శ్రీకృష్ణ, ఆయన అనుచరులు రూ.50 వేలు అందజేశారు.

గుమ్మ గెడ్డ అభివృద్ధి కలేనా?

● పేరుకుపోయిన పూడిక, పిచ్చి మొక్కలు
● సాగునీరు అందక ఆయకట్టు రైతుల ఆందోళన



సీది సమీపంలో పూడికతో నిండిన గుమ్మగెడ్డ

పాతపట్నం: మండలంలోని గుమ్మ గెడ్డ ఆయకట్టు రైతులకు సాగునీటి కష్టాలు వీడటం లేదు. చాకిపల్లి, ఎ.ఎస్.కవిటి, రొమదల, రొంపివలస, సీది, కొరసవాడ, తామర, తీమర, గంగువానిపేట, పాతపట్నం సమీపంలో సుమారు 2 వేల ఎకరాల విస్తీర్ణంలో ఉన్న గుమ్మగెడ్డ అభివృద్ధికి నోచుకోవడం లేదు. ప్రస్తుతం గుమ్మగెడ్డ చానల్ పూడిక, పిచ్చి మొక్కలతో పేరుకుపోయింది. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం స్పందించి గుమ్మగెడ్డ లోతును పెంచి, వెడల్పు చేయాలని రైతులు కోరుతున్నారు.

నీలమణిదుర్గ ఆలయానికి పోటెత్తిన భక్తులు



క్యూలో ఉన్న భక్తులు

పాతపట్నం: ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం పాతపట్నం గ్రామదేవత నీలమణిదుర్గ అమ్మవారి ఆలయం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. అషాఢ మాసం సందర్భంగా అమ్మవారి ఆలయానికి తెల్లవారు జామునుంచే స్థానికులతోపాటు ఒడిశా ప్రాంతానికి చెందిన భక్తులు అధిక సంఖ్యలో వచ్చి కుంకుమ, ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి ఘటాలతో మొక్కులు చెల్లించారు. పలువురు వాహన పూజలు చేశారు.



